## క్లుప్తంగా

### రామాలయం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న జెడ్పీటీసీ నారాయణమ్మ

**ఇచ్ఛాపురం రూరల్:** మండలంలోని ఈదుపురం బస్టాండ్‌లో రామాలయం నిర్మాణానికి జెడ్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ శుక్రవారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో ఇచ్ఛాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్, గ్రామ పెద్దలు దుక్క నీలాద్రి రెడ్డి, అంబటి గంగాధరరెడ్డి, వీఆర్వో ఉప్పాడ రాజారెడ్డి, నీలగిరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### అభినందనలు



ఎస్‌ఐ బాలరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

**కంచిలి:** స్థానిక పోలీసుస్టేషన్ నూతన ఎస్‌ఐగా విధుల్లో చేరిన ఎస్.బాలరాజును ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి తదితరులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు యారడి ఆనందరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

### ‘గిరిజన భూములను కాపాడాలి’



తహసీల్దార్ పాపారావుకు వినతిపత్రం అందిస్తున్న గిరిజనులు

**మందస:** మండలంలోని లొడకపిట్ట, చొక్కంబో, కారిగాం పరిసర ప్రాంతాల్లో గిరిజనుల సాగు భూములను అధికారులే రక్షించాలని చీపి సర్పంచ్ సవర లక్ష్మీప్రియ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గిరిజన సంఘం నాయకుడు సవర చిరంజీవి, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి సవర ధర్మారావులు కోరారు. ఈ మేరకు తహసీల్దార్ బడే పాపారావుకు శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు. గిరిజనుల సాగులో ఉన్న సుమారు 70 ఎకరాల భూమిని కొంతమంది వ్యక్తులు సర్వేయర్లను తీసుకొచ్చి కొలతలు కొలుస్తూ, ఇవి తమ భూములంటూ పేర్కొంటున్నారన్నారు. సుమారు 50 ఏళ్ల నుంచి ఈ భూములను సాగు చేస్తున్నామని, కానీ ప్రస్తుతం భూములు ఆక్రమించుకోవడానికి ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. సాగులో ఉన్న భూములను కాపాడాలని కోరారు. కార్యక్రమంలో సవర బుడ్డు, కడంజి, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

### ఫిష్ ఆంధ్రతో నిరుద్యోగులకు ఉపాధి



ఫిష్ ఆంధ్ర వాహనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్

**టెక్కలి:** ఫిష్ ఆంధ్రతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కలుగుతున్నాయని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ అన్నారు. సంతబొమ్మాళి మండలం గెద్దలపాడు గ్రామానికి చెందిన మత్స్యకారుడికి మంజూరైన ఫిష్ ఆంధ్రా వాహనాన్ని శుక్రవారం టెక్కలిలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో మత్స్యకారుల సంక్షేమానికి ప్రత్యేకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మేరుగు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సాయం అందజేస్తున్న దృశ్యం

**కంచిలి:** మండలంలోని బొగాబెణి పంచాయతీ పరిధి జెన్నాగాయి గ్రామానికి చెందిన గుమ్మడి గవరయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో మృతుని కుటుంబానికి స్థానిక ఎంపీటీసీ సభ్యుడు బొండాడ వైకుంఠరావు రూ.5 వేలు ఆర్థిక సాయాన్ని సర్పంచ్ గణప సింహాచలంతో కలిసి శుక్రవారం అందించారు. అదేవిధంగా వైఎస్సార్ బీమా తక్షణం సాయం రూ.10 వేలును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ కన్వీనర్ గుమ్మడి చంద్రయ్య, గణప రామారావు, గుమ్మడి వెంకటరావు, వెల్ఫేర్ అసిస్టెంట్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# త్వరితగతిన అభివృద్ధి పనులు

- ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్



అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్సీ దువ్వాడ తదితరులు

**టెక్కలి:** డివిజన్ కేంద్రమైన టెక్కలిలో ప్రజలకు అంకితం చేయనున్న పట్టుమహాదేవి కోనేరు అభివృద్ధి పనులను త్వరితగతిన చేపట్టాలని ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ ఆదేశించారు. కోనేరులో జరుగుతున్న పనులను అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సుమారు రూ.5 కోట్ల అంచనా వ్యయంతో సర్వాంగ సుందరంగా కోనేరును అభివృద్ధి చేస్తున్నట్లు తెలియజేశారు. ఇప్పటికే డీఎంఎఫ్ కింద సుమారు రూ.70 లక్షలు మంజూరైనట్లు వెల్లడించారు. ఇప్పటివరకు జరిగిన పనులు, వాటికి చేసిన ఖర్చు, సాంకేతిక పరిస్థితులపై అధికారులతో చర్చించారు. వర్షాలు కురవక మునుపు క్షేత్రస్థాయి పనులు పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఆయనతో పాటు పంచాయతీరాజ్ ఈఈ వి.సురేష్, డీఈ ధర్మారావు, జేఈ ఎస్ఎల్.నాయుడు తదితరులు ఉన్నారు.

## స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు



మాట్లాడుతున్న ఎంపీడీవో సూర్యనారాయణ

**కవిటి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్నకు చెబుతాం(1902) టోల్‌ఫ్రీ నంబర్‌కు వచ్చే ఫిర్యాదులతో పాటు, ప్రతిరోజూ గ్రామ సచివాలయాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వచ్చే స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుంటున్నామని ఎంపీడీవో పి.సూర్యనారాయణ తెలియజేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్ష సమావేశాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా వచ్చిన ఫిర్యాదులు, తక్షణ పరిష్కారాలు చూపినవి, ప్రస్తుతం పరిష్కార దశలో ఉన్న ఫిర్యాదులు, తిరస్కరించిన వాటిపై సమీక్షించి కలెక్టర్‌కు నివేదిక పంపించారు. సమావేశంలో తహసీల్దార్ సంతోష్, ఎస్‌ఐ కె.రాము, మండల పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ బి.శిరీషా, ఈవోపీఆర్డీ శివాజీపాణిగ్రాహి, ఏపీఎం కె.గోవింద, ఏపీవో కడియం భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలకు అతీతంగా ‘భారత్ బచావో’



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**టెక్కలి:** రాజకీయ పార్టీలకు అతీతంగా భారత్ బచావో ఉద్యమాన్ని ముందుకు నడిపించి, బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేయాలని భారత్ బచావో జిల్లా కన్వీనర్ పి.పరమేశ్వరరావు కోరారు. వివిధ ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీ నాయకులతో శుక్రవారం సంతబొమ్మాళి మండలం ఇజ్జువరం గ్రామంలో భారత్ బచావో కరపత్రాలను ఆవిష్కరించారు. భిన్న భావజాలం కలిగిన వారంతా ఈ ఉద్యమానికి మద్దతు పలకాలని కోరారు. అలాగే ఈనెల 11న టెక్కలి అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించనున్న మహాసభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రజా సంఘాల నాయకులు ఎం.కృష్ణయ్య, కె.ధర్మారావు, బి.ప్రభాకర్, డి.వెంకట్రావు, కమల, బి.ఊర్మిళ, సూర్యనారాయణ, టి.వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## బొడ్డేపల్లి సేవలు మరువలేనివి



బొడ్డేపల్లి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

**కోటబొమ్మాళి:** శ్రీకాకుళం జిల్లాకు దివంగత బొడ్డేపల్లి రాజగోపాల్‌రావు చేసిన సేవలు మరువలేనివని జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బొడ్డేపల్లి శత జయంతి ఉత్సవాలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు విద్యావంతులు, నాయకులు మాట్లాడుతూ.. బొడ్డేపల్లి సేవలను గుర్తు చేశారు. అనంతరం దాతల విరాళాలతో రూ.7 లక్షల వ్యయంతో కోటబొమ్మాళి మండల పరిషత్ వద్ద మెయిన్ రోడ్డులో బొడ్డేపల్లి విగ్రహం ఏర్పాటుకు తీర్మానం చేశారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, జిల్లా రైతు సమాఖ్య సభ్యుడు కవిటి రామరాజు, సర్పంచ్‌లు నూక సత్యరాజ్, కాల్ల సంజీవరావు, మెండ తాత, పేడాడ వెంకటరావు, రెడ్డి లక్ష్మణ, న్యాయవాది లఖినేని శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## స్వామిత్వ సర్వేతో పక్కాగా గృహహక్కు



సమీక్ష నిర్వహిస్తున్న డీఎల్‌పీవో రమణ

**టెక్కలి:** ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన స్వామిత్వ సర్వేతో ప్రతీ గృహానికి పక్కాగా హక్కు కలుగుతుందని టెక్కలి డివిజన్ పంచాయతీ అధికారి ఐ.వి.రమణ తెలిపారు. పట్టణ, గ్రామ స్థాయిలో స్వామిత్వ సర్వేపై స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో రమణ మాట్లాడుతూ గ్రామ కంఠాలు, ప్రభుత్వ స్థలాలు, దేవాలయాలు, గృహాలు మధ్య ఖాళీగా ఉన్న ప్రదేశాల్లో పక్కాగా సర్వే నిర్వహించి, వాటికి శాశ్వతంగా హక్కు కల్పించేందుకు జగనన్న శాశ్వత భూ హక్కు పథకానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. ఇటువంటి సర్వేపై పంచాయతీ కార్యదర్శులు ఎంతో నిబద్ధతగా పనిచేయాలని సూచించారు. ఎక్కడా ఎటువంటి ఆక్షేపణలు లేకుండా పక్కాగా సర్వే నిర్వహించాలన్నారు. ఎటువంటి సందేహాలు కలిగినా తక్షణమే పైఅధికారులను సంప్రదించాలని సూచించారు. అనంతరం పలువురు పంచాయతీ కార్యదర్శుల సందేహాలను నివృత్తి చేశారు. సమావేశంలో ఈవోపీఆర్డీలు హెచ్.శశిభూషణ్, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

## తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యం



మినీ వాటర్ స్కీమ్ ప్రారంభిస్తున్న ఎంపీపీ దేవదాస్‌రెడ్డి

**కంచిలి:** వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రతీ గ్రామంలో తాగునీటి సౌకర్యానికి ప్రాధాన్యమిస్తున్నట్లు ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి తెలియజేశారు. మండలంలోని పెద్దకొజ్జిరియా గ్రామంలో ఉన్న పాఠశాలవీధిలో 15వ ఆర్థిక సంఘం మండల పరిషత్ నిధులు రూ.2.4 లక్షల వ్యయంతో ఏర్పాటు చేసిన, రూ.2 వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మినీ వాటర్ స్కీమ్‌ను స్థానిక సర్పంచ్ పొందల ఢిల్లీరావు ఆధ్వర్యంలో శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వజ్జ మృత్యుంజయరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు యారడి ఆనందరావు, కొల్లూరు పార్టీ నేత పైల లక్ష్మీనారాయణ, స్థానిక నేతలు పాశాల సత్యం, బల్లెడ సీతారాం, పాశాల ఉపేంద్ర, బార్ల రజని, పాశాల నరసయ్య, బొడ్డ దశరథరావు, పండి సీతారాం, పండి దుర్యోధన, బొడ్డ సుబ్బారావు, బొడ్డ సూర్యనారాయణ, ఎలుసూరి అప్పలస్వామి పాల్గొన్నారు.

## వలంటీర్లకు ఘన సన్మానం



కాశీబుగ్గ: వలంటీర్లను సత్కరిస్తున్న చైర్మన్ గిరిబాబు తదితరులు



కోటబొమ్మాళి: వలంటీర్లను సత్కరిస్తున్న దృశ్యం

**కోటబొమ్మాళి:** మండలంలోని మహసాహెబ్‌పేట, కమలనాభపురం, తాటిపర్తి సచివాలయాల పరిధిలోని గ్రామ వలంటీర్లను జెడ్పీటీసీ దుబ్బ వెంకటరమణారావు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు రోణంకి మల్లయ్య, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్.హేమసుందరరాజు, సర్పంచ్ ఎస్.ధనలక్ష్మి, పేడాడ వెంకటరావు, ఎస్.వినోద్, ఉప సర్పంచ్ తర్ర రమణ తదితరులు పాల్గొన్నారు.

**కాశీబుగ్గ:** పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఉన్నటువంటి 17వ వార్డు, 2వ వార్డు వలంటీర్లను మున్సిపల్ చైర్మన్ బళ్ల గిరిబాబు ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు సనపల సింహాచలం, సచివాలయాల కన్వీనర్ బడగల బళ్లయ్యనాయుడు, మున్సిపల్ కమిషనర్ టి.నాగేంద్రకుమార్, మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుడు బమ్మిడి సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## 4 నుంచి కిష్టుపురం ఉత్సవాలు

**కాశీబుగ్గ:** పలాస మండలంలోని కిష్టుపురం గ్రామంలో ఈనెల 4వ తేదీ నుంచి బాడ పోలమ్మ గ్రామదేవత ఉత్సవాలను నిర్వహించనున్నట్లు గ్రామ కమిటీ సభ్యులు శుక్రవారం ప్రకటనలో తెలియజేశారు. పూర్వీకుల నుంచి వస్తున్న ఆచారం ప్రకారం ఉత్సవాలను కొనసాగిస్తున్నామన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని విజయవంతం చేయాలని కోరుతున్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య



క్యాంపెయిన్ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

**కాశీబుగ్గ:** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతోందని కాశీబుగ్గ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు అన్నారు. తమ పాఠశాలలో విద్యార్థులను చేర్పించాలని కోరుతూ నిత్యానందనగర్, నెహ్రూనగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పాఠశాలలో అత్యుత్తమ ఉపాధ్యాయ సిబ్బంది, అత్యుద్భుతమైన సదుపాయాలు ఉన్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నగిరి లక్ష్మి, వేదవతి, శ్రీదేవి, శ్రీలక్ష్మి, వెంకట్రావు, యతిరాజు, జగదీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## చిరస్మరణీయుడు రేవతిపతి



రేవతిపతి విగ్రహానికి నివాళులర్పిస్తున్న కృపారాణి, తిలక్ తదితరులు

**టెక్కలి:** ప్రజలకు నిస్వార్థమైన సేవలు అందజేసి, వారి మదిలో చిరస్మరణీయంగా నిలిచిపోయిన నాయకుడు దివంగత టెక్కలి ఎమ్మెల్యే కొర్ల రేవతిపతి అని కేంద్ర మాజీమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి అన్నారు. శుక్రవారం రేవతిపతి వర్ధంతి సందర్భంగా స్థానిక తొలుసూరుపల్లి రోడ్‌లోని ఆయన విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో రేవతిపతి భార్య మాజీ ఎమ్మెల్యే కొర్ల భారతి, నాయకులు డాక్టర్ కె.రామ్మోహన్‌రావు, దుబ్బ వెంకట్రావు, ఎస్.హేమసుందర్‌రాజు, అన్నెపు రామారావు, సత్తారు సత్యం, ఎం.గణపతిరావు, డి. పూర్ణాచారి, కె.సంజీవరావు, హెచ్.ఉదయ్‌భాస్కర్, టి.లోకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణ మిశ్రమ దాణా పంపిణీ

**మందస:** మండలంలోని రైతులకు సంపూర్ణ మిశ్రమ దాణా(టీఎంఆర్)ను హరిపురం, మందస పశు వైద్యాధికారులు దువ్వాడ శ్రీకాంత్, కిల్లి ఉమాభారతిలు హరిపురంలో శుక్రవారం పంపిణీ చేశారు. పాడి పశువులకు ఎంతగానో ఉపయోగపడే ఈ దాణాను ప్రభుత్వం సబ్సిడీపై అందజేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో హరిపురం ఎంపీటీసీ ఆనల అప్పన్న, పి.రాము, పశు వైద్య సిబ్బంది వి.లక్ష్మి, ఎస్.ధర్మేంద్ర, సీహెచ్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ‘జగనన్నకు చెబుదాం’పై నిర్లక్ష్యం వద్దు



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రవికృష్ణ

**వజ్రపుకొత్తూరు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్నకు చెబుదాం వినతులపై నిర్లక్ష్యం వద్దని మండల ప్రత్యేకాధికారి మట్ట రవికృష్ణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సీహెచ్ ఈశ్వరమ్మ అధ్యక్షతన వినతులు పరిష్కారంపై సమావేశం శుక్రవారం నిర్వహించారు. ప్రతీ సోమవారం వచ్చే వినతులను ఆయా శాఖల అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బి.అప్పలస్వామి, సబ్ ఇన్‌స్పెక్టర్ వై.మధుసూదనరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

# పనులు వేగవంతం చేయాలి

- సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి



సమీక్ష నిర్వహిస్తున్న సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి

**టెక్కలి:** గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయా గ్రామ సచివాలయాల పరిధిలో మంజూరైన నిధుల మేరకు పనులు వేగవంతం చేయాలని టెక్కలి సబ్ కలెక్టర్ టి.రాహుల్‌కుమార్ రెడ్డి ఆదేశించారు. టెక్కలి డివిజన్ పరిధిలోని పంచాయతీరాజ్, ఎన్ఆర్ఈజీఎస్ పనులకు సంబంధించి అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయాల పరిధిలో గుర్తించిన పనుల్లో అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తక్షణమే పనులను ప్రారంభించి సంతృప్తికరమైన పురోగతి తీసుకురావాలని సూచించారు. అలాగే ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో చేపడుతున్న పనులను వేగవంతం చేయాలని పేర్కొన్నారు. సమీక్షలో పీఆర్ ఈఈ వి.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా సంక్షేమ పథకాలు



సంక్షేమ పథకాలు వివరిస్తున్న దువ్వాడ వాణి తదితరులు

- వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి
- బన్నువాడ పంచాయతీలో గడప గడపకూ మన ప్రభుత్వం

**టెక్కలి:** వైఎస్సార్‌సీపీ హయాంలో రాజకీయాలకు అతీతంగా పారదర్శకంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని వైఎస్సార్‌సీపీ నాయకురాలు దువ్వాడ వాణి అన్నారు. మండలంలోని బన్నువాడ పంచాయతీ మోదుగువలస, నంబాలపేట గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటికీ వెళ్లి గత నాలుగేళ్లుగా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ఒకప్పుడు ప్రభుత్వ పథకం అందాలంటే రాజకీయ నాయకులు, అధికారుల చుట్టూ తిరగాల్సిన దుస్థితి ఉండేదన్నారు. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ పాలనలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ నేరుగా ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని గుర్తు చేశారు. ఇటువంటి ప్రభుత్వానికి మరోసారి అవకాశం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సరోజనమ్మ, సర్పంచ్ పి.మోహన్‌రావు, జి.మోహన్‌రెడ్డి, ఎం.శంకర్, నాయకులు ఎ.రవి, పి.శ్రీను, జి.గణేష్, ఎం.శివరావు తదితరులు పాల్గొన్నారు.

# ‘వెట్టి చాకిరీ చేయిస్తే చర్యలు’



తనిఖీలు నిర్వహిస్తున్న చైల్డ్ లైన్ వెల్ఫేర్ అధికారులు

**టెక్కలి:** పాఠశాలలకు వెళ్లాల్సిన బాలలతో వెట్టి చాకిరీ చేయిస్తే కఠిన చర్యలు తప్పవని మానవ అక్రమ రవాణా నివారణాధికారి ఎల్.వెంకట్రావు, టెక్కలి సహాయ కార్మిక శాఖాధికారి రాధాకుమారి హెచ్చరించారు. బాలల సంరక్షణా విభాగం, కార్మిక శాఖా ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం పలు దుకాణాలు, వాణిజ్య సముదాయాలు, పరిశ్రమలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ బడిఈడు పిల్లలతో వెట్టి చాకిరీ చేయిస్తున్నట్లు తెలిస్తే తక్షణమే అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రస్తుత ప్రభుత్వం బాల కార్మికుల నివారణ కోసం ప్రత్యేకంగా చర్యలు చేపడుతోందని వెల్లడించారు. దీనిలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో నాణ్యమైన విద్య, వసతి సదుపాయాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో బాలల రక్షణా విభాగం అధికారి ఎం.మల్లేశ్వరరావు, చైల్డ్ లైన్ అధికారులు జగదీశ్వరి, శివాజీ, జనార్దన్, చైల్డ్ వెల్ఫేర్ పోలీస్ అధికారి వెంకటరమణ, ఏఎస్‌డబ్ల్యూవో డి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా..

### ‘అనధికారిక లిఫ్టలను నియంత్రించాలి’

**వజ్రపుకొత్తూరు రూరల్:** వంశధార కాలువలో ఏర్పాటు చేసిన అనధికారిక లిఫ్టలను నియంత్రించి,శివారు భూములకు సాగునీరు అందించాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి కొనారి మోహన్‌రావు కోరారు. మండలంలోని సీతాపురంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. అనధికారిక లిఫ్టలతో పాటు వంశధార కాలువ మరమ్మతులకు గురవ్వడంతో గత నాలుగేళ్లుగా వంశధార శివారు భూములకు సాగునీరు అందని పరిస్థితి ఏర్పడిందన్నారు. సాగునీరు అందించక పంటనష్టం వాటిళ్లుతుంటే, రైతుల నుంచి అధికారులు నీరు తీరువా వసూళ్లు చేయడంతో మరింత ఆర్థిక భారం అవుతోందన్నారు. ప్రధానంగా వంశధార 60 ఆర్ఎల్ కణితివూరు నుంచి 5ఎల్ బెండి వరకు కాలువలో పూడిక తీత చేయాలని, చెరుకుపల్లి వద్ద చెక్‌డ్యాం మరమ్మతులు చేపట్టాలని కోరారు. సమావేశంలో ఆయనతో పాటు రైతు సంఘం మండల కార్యదర్శి తమ్మినాన భాస్కరరావు, సర్పంచ్ తమ్మినాన ఢిల్లీరావు, టి.వాసు తదితరులు ఉన్నారు.

### సహాయ కార్మికాధికారిగా విజయ్‌కుమార్

**సోంపేట:** పట్టణ సహాయ కార్మికాధికారిగా విధులు నిర్వహిస్తున్న పి.సూర్యనారాయణ బదిలీపై అనకాపల్లి జిల్లా చోడవరం సహాయకార్మికాధికారిగా విధుల్లో చేరారు. దీంతో సోంపేట సహాయ కార్మికాధికారిగా పలాస సహాయ కార్మికాధికారి ఎం.విజయ్‌కుమార్ ఇన్‌చార్జి అధికారిగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు.

### దళితుల అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

**కోటబొమ్మాళి:** దళితుల అభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌తోనే సాధ్యమని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మోనటరింగ్ కమిటీ సభ్యుడు చల్ల చిరంజీవి అన్నారు. శుక్రవారం కోటబొమ్మాళిలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కోటబొమ్మాళి మండల పరిషత్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల స్థలం మంజూరు చేసిందన్నారు. టీడీపీ ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు వద్ద మూడు దశాబ్దాలుగా దళితులు మొరపెట్టుకున్నా స్థలం కేటాయించలేదన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకున్న నెల రోజుల్లోనే స్థలం కేటాయించారని చెప్పారు. అయితే కొందరు టీడీపీ నాయకులు తామే స్థలం మంజూరు చేయించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, వాటిని ఎవరూ నమ్మవద్దని కోరారు.

### రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



యంత్రసేవా పథకం యూనిట్లను అందజేస్తున్న దృశ్యం

**మందస:** రైతు సంక్షేమమే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ డొక్కరి దానయ్య, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అగ్గున్న సూర్యారావు అన్నారు. మండలంలోని పితాతొలిలో వైఎస్సార్ యంత్రసేవా పథకం యూనిట్లను శుక్రవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అన్నదాత అభివృద్ధికి ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. వ్యవసాయంలో యాంత్రీకరణకు 40 శాతం సబ్సిడీతో యంత్రాలను, పరికరాలను అందజేస్తోందని తెలియజేశారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పితాతొలి, భైరిసారంగపురం సర్పంచ్‌లు చింతాడ సుధ, రట్టి సరస్వతి, సచివాలయాల మండల కన్వీనర్ చింతాడ గణపతి, మాజీ సర్పంచ్ బాడ జగన్నాయకులు, ఎంపీటీసీ మట్ట లక్ష్మమ్మ, నాయకులు సాప రామారావు, మట్ట షణ్ముఖరావు, తమ్మినేని లక్ష్మణదాసు, సాప లలిత, చింతాడ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

### తహసీల్దార్‌గా సత్యనారాయణ

**సోంపేట:** మండల తహసీల్దార్‌గా బి.శివ సత్యనారాయణ శుక్రవారం విధుల్లో చేరారు. ఈయన ఇదివరకు ఎల్ఎన్‌పేట తహసీల్దార్‌గా విధులు నిర్వహించారు. విధుల్లో చేరిన ఆయనకు సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.